నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, సోమవారం 4 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI

యోగానందుడికి గజ వాహన సేవ

గజ వాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

అర్వపల్లి, మార్చి 3 : అర్వపల్లిలోని యోగానంద లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గజ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం సుదర్శన ఆదిత్య హృదయ పారాయణం, అర్చన, అభిషేకాలు జరిపించారు. గజ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి భూదేవి కొలువుదీరగా మాడ వీధుల్లో ప్రదక్షిణలు చేశారు. అనంతరం పుర వీదుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటికీ హారతులిచ్చి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ధర్మకర్త కనుకు రేణుక, అర్చకులు రాంబాబు, పవన్, భక్తులు పాల్గొన్నారు.

పోచంపల్లికి ఐఐహెచ్‌టీ దక్కేనా?

- ఏర్పాటు ఎక్కడనేది తేల్చని కాంగ్రెస్ సర్కారు
- పోచంపల్లిలోనే పెట్టాలని 2017లో కేంద్రానికి ప్రతిపాదనలు
- ఇక్కడే అనేక అనుకూలతలు, సానుకూల అంశాలు
- అందుబాటులో ఉన్న హ్యాండ్లూమ్ పార్కు, భవనాలు
- నెలకొల్పితే చేనేత పరిశ్రమ బలోపేతానికి దోహదం
- డిప్లొమా, డిగ్రీ పీజీ కోర్సులతోపాటు పరిశోధన, అధ్యయనాలు
- మన దగ్గరే ఏర్పాటు చేయాలని నేతన్నల డిమాండ్

తెలంగాణకు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం

భూదాన్ పోచంపల్లిలో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఐఐహెచ్‌టీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ) ఏర్పాటుపై నేతన్నల్లో ఆశలు చిగురించాయి. ఇక్కడ ఏర్పాటు చేయాలన్న ప్రజల చిరకాల ఆకాంక్ష అడుగు దూరంలోనే ఉంది. ఎన్నో వినతులు, విజ్ఞప్తుల తర్వాత తాజాగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ మంజూరు చేసింది. ఇనిస్టిట్యూట్ ఎక్కడ ఏర్పాటు చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఐఐహెచ్‌టీ వస్తే నేత కార్మికుల వృత్తి నైపుణ్యత మెరుగుపడటం, చేనేత పరిశ్రమ మరింత బలోపేతం కావడంతోపాటు నేతన్నల ఉపాధి రెట్టింపు అవుతుంది. ఇక్కడే అనేక అనుకూలతలు, సానుకూల అంశాలు ఉన్నాయని, పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, మార్చి 3 (నమస్తే తెలంగాణ)

నిరుపయోగంగా ఉన్న పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు

సర్కారు చేతుల్లోనే నిర్ణయం..

దేశంలోనే అత్యుత్తమ చేనేత నైపుణ్య విద్యాసంస్థగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి పేరుంది. విద్యకు ఐఐటీ మాదిరిగా చేనేతకు ఐఐహెచ్‌టీని పరిగణిస్తారు. దేశ వ్యాప్తంగా పది సంస్థలు ఉన్నా.. అత్యధికంగా నేత కార్మికులు ఉన్న తెలంగాణలో మాత్రం ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. ఇంతకాలానికి రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఐఐహెచ్‌టీని మంజూరు చేసింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వమే చూసుకోనుంది. విద్యాసంస్థ ఏర్పాటు, నిర్వహణ, సిబ్బంది నియామకం మన సర్కారు చేతుల్లోనే ఉంటుంది. అయితే ఐఐటీహెచ్ ఎక్కడ నెలకొల్పుతారనేది స్పష్టత రాలేదు. దీనిపై క్లారిటీ వస్తే ఫస్ట్ బ్యాచ్‌లో 75మందితో ఐఐహెచ్‌టీని ప్రారంభించే అవకాశం ఉంది.

పోచంపల్లిలో ఏర్పాటుకు గతంలోనే ప్రతిపాదనలు

రాష్ట్రంలో నలభై వేల చేనేత కుటుంబాలు ఉండగా, అత్యధికంగా భూదాన్ పోచంపల్లిలో నేత కార్మికులు ఉన్నారు. ఆనాదిగా వస్తున్న సంప్రదాయ పద్ధతులను నమ్ముకొని మగ్గాలపై చేనేత వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. పెద్ద ఎత్తున వస్త్ర వ్యాపారం, తయారీ రంగం ఉంది. ఈ నేపథ్యంలో చేనేత సాంకేతిక కోర్సుల వైపు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఐఐహెచ్‌టీల్లో కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం దేశంలోనే పది రాష్ట్రాల్లో ఈ సంస్థ ఉంది. ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, అసోం, రాజస్థాన్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళ, కర్నాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఉన్నాయి. కానీ తెలంగాణలో ఐఐహెచ్‌టీ లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది ఆర్థికంగా ఇబ్బంది కావడంతోపాటు, దూరభారం అవుతున్నది. అయితే భూదాన్‌పోచంపల్లిలోనే ఐఐహెచ్‌టీని నెలకొల్పాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో అన్ని వివరాలతో కేంద్ర ప్రభుత్వానికి గత రాష్ట్ర సర్కారు పలు సార్లు ప్రతిపాదనలు కూడా పంపించింది.

ఎన్నో సానుకూల అంశాలు..

పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు ఎన్నో అనుకూలతలు, సానుకూల అంశాలు ఉన్నాయి. ఇప్పటికే పోచంపల్లి చేనేతకు ప్రసిద్ధిగాంచింది. ఇక్కత్ వస్త్రాలకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. ఇక మండలంలోని కనుముక్కుల పరిధిలో ఉన్న హ్యాండ్లూమ్ పార్క్‌లో భవనాలు అందుబాటులో ఉన్నాయి. ఇది 23 ఎకరాల్లో విస్తరించి ఉంది. 5000 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఈ పార్క్ పెట్టుబడి సరైన నిర్వహణ లేక మూతపడింది. దీన్ని గతేడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.12.5 కోట్లతో కొనుగోలు చేసింది. ప్రస్తుతం పార్కులోని విశాలమైన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. అంతేకాకుండా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు పలు జిల్లా కేంద్రాలకు పోచంపల్లి దగ్గరలో ఉంటుంది.

అన్ని విధాలుగా మేలు..

ఐఐహెచ్‌టీ ఏర్పాటైతే అనేక విధాలుగా దోహదపడుతుంది. మన దగ్గరే టెక్నికల్ డిగ్రీ, డిప్లొమాలను పొందే అవకాశం దక్కుతుంది. చేనేత, జౌళి, డిప్లొమా డిగ్రీ పీజీ కోర్సులతోపాటు పరిశోధన, అభివృద్ధి అధ్యయనాలు జరుగుతాయి. రెగ్యులర్ శిక్షణతోపాటు టెక్నికల్ టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన చదువులు, టెక్స్‌టైల్ డిజైనింగ్, దుస్తుల డిజైనింగ్, మార్కెటింగ్, అంతర్జాతీయ వర్తకం లాంటి అంశాల్లో బోధన అందుతుంది. చదువుకొని చేనేత వృత్తులోకి రావాలనుకునే యువతకు ఉపాధి లభిస్తుంది. ఆన్‌లైన్ చీరెల వ్యాపారానికి యువకులు అవసరమైన మెళకువలు నేర్చుకుంటారు. చేనేత రంగం మరింత బలపడేందుకు నైపుణ్యం కలిగిన వ్యక్తులను తీర్చిదిద్దేందుకు సంస్థ దోహదపడుతుంది. అంతే కాకుండా చేనేత కార్మికులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి వేదిక అవుతుంది. ముఖ్యంగా స్పిన్నింగ్, వీవింగ్, డిజైనింగ్, డైయింగ్, ప్రింటింగ్, గార్మెంట్ మేకింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాల్లో సాంకేతిక పద్ధతుల్లో శిక్షణ ఇస్తారు.

కేటీఆర్ ప్రత్యేక చొరవ

ఐఐహెచ్‌టీకి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో కూడా నెలకొల్పాలని మాజీ మంత్రి కేటీఆర్ అనేక విధాలుగా తన వంతు ప్రయత్నాలు చేశారు. అవకాశం వచ్చిన ప్రతి సందర్భంలో దీని ప్రస్తావన తీసుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు లేవదీశారు. అనేక సార్లు కేంద్ర మంత్రులకు స్వయంగా లేఖలు రాశారు. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని నేరుగా కలిసి విజ్ఞప్తి చేశారు. భూదాన్‌పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటుపై విన్నవించారు. కాగా భూదాన్ పోచంపల్లిలోనే ఏర్పాటు చేస్తారా..? లేకుంటే సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న గద్వాలకు తరలించుకుపోతారా అనేది వేచి చూడాల్సిందే.

పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలి..

పోచంపల్లి అంటేనే చేనేతకు బ్రాండ్ అంబాసిడర్. ఇక్కత్ వస్త్రాలకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన ఐఐహెచ్‌టీ పోచంపల్లిలోనే నెలకొల్పాలి. ఇందుకు అన్ని అర్హతలు, అనుకూలతలు ఉన్నాయి. అన్ని రకాలు వసతులు, వనరులు ఉన్నాయి. కేంద్రం దివాళా తీయిస్తే పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును బీఆర్ఎస్ సర్కారు కొనుగోలు చేసింది. ఇదిప్పుడు నిరుపయోగంగానే ఉంది. మన దగ్గర్నే ఉంటే అనేక విధాలుగా నేతన్నలకు మేలు జరుగుతుంది. ఇక్కడే ఏర్పాటు చేయాలని గతంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం, కేటీఆర్ ద్వారా కేంద్రానికి లేఖలు రాయించాం. ఎట్టి పరిస్థితుల్లోనూ పోచంపల్లిలోనే ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలి. లేకుంటే ప్రభుత్వంతో పోరాటం తప్పదు.

– పైళ్ల శేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఇక్కడ పెడితే చేనేతలకు మేలు

పోచంపల్లిలోని కనుముక్కుల గ్రామంలో చేనేత పార్కును ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇక్కడ ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తే చేనేత కార్మికులకు ఎంతో మేలు జరుగుతుంది. నూతన డిజైన్ల ఆవిష్కరణకు అవకాశం ఉంటుంది. ఇక్కత్ వస్త్ర పరిశ్రమ మరింత మెరుగుపడుతుంది.

–రుద్ర వెంకటేశం, చేనేత కార్మికుడు భూదాన్ పోచంపల్లి

ఆలయంలో భక్తుల రద్దీ

యాదగిరి గుట్టలో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట, మార్చి3 : పంచనారసింహుడి క్షేత్రంలో భక్తుల కోలాహలం నెలకొన్నది. ఆదివారం సెలవుదినం కావడంతో స్వయంభూ నారసింహుడి దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాడవీధులు, క్యూ కాంప్లెక్స్, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచే నారసింహుడిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నిత్య తిరుకల్యాణోత్సవం, సువర్ణ పుష్పార్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష్మీనరసింహ స్వామి నిత్య తిరు కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా సాగింది. ఉదయం స్వామివారికి సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవ నిర్వహించారు. వెలుపలి ప్రాకార మండపంలో తూర్పు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు కల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని తిలకించారు. స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వయంభూ నారసింహుడిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన నిర్వహించి, ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవ, దర్బార్ సేవ వైభవంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజల ఘనంగా జరిగాయి. స్వామివారి ధర్మదర్శానికి 2 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారిని సుమారు 27వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ. 39,55,896 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న పీఈటీ, పీడీలు

పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని పాదయాత్ర

భువనగిరి కలెక్టరేట్, మార్చి 3 : రాష్ట్రంలో పీఈటీ, పీడీ పోస్టులను భర్తీ చేయాలని పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదగోని సైదులు గౌడ్ అన్నారు. యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి వరకు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పాదయాత్ర భువనగిరి కలెక్టరేట్ వద్దకు చేరుకోగా మాదగోని సైదులు గౌడ్ మీడియాతో మాట్లాడారు. పీఈటీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, పీఈటీ, పీడీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బీబీనగర్ లక్ష్మణ్, కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, నాయకులు ఉపేందర్, రమేశ్‌రెడ్డి, ఆంజనేయులు, సుధాకర్, శ్రీకాంత్, వెంకటేశం, రాజశేఖర్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

యాదగిరిగుట్ట, మార్చి 3 : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ యాదగిరిగుట్ట డిపో కార్మికులు డిమాండ్ చేశారు. ఆదివారం యాదగిరిగుట్ట డిపో దగ్గర కార్మికులు యూనియన్లకు అతీతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను వెంటనే చెల్లించాలని, ఆర్టీసీ కార్మికులు నిర్వహించిన బండ్ కాలం నాటి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆర్టీసీ కార్మికుల సమస్యలను తెలియజేసేందుకే ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్మికుల పక్షపాతిగా ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు మురళి, కృష్ణయ్య, కుమార్, రమేశ్, యాదగిరి, నగేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అడుగంటిన ఆశలు

- జిల్లాలో ఎండుతున్న పంటలు
- బోర్లు, బావుల్లో నీళ్లు లేక ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా


చిట్యాల మండలం పిట్టంపల్లిలో వరి పొలానికి ట్యాంకర్‌తో నీరు పెడుతున్న రైతు లింగారెడ్డి

త్రిపురారం, మార్చి 3 : జిల్లాలో సాగునీటికి కష్టంగా మారింది. బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పొలాలకు నీరందే పరిస్థితి లేదు. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి పంటలను తడుపుతున్నారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రానికి చెందిన నగిరి శ్రీనివాస్ తనకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. బావి, బోరు ఉన్నప్పటికీ నీళ్లు సరిపోకపోవడంతో నెల క్రితం పొలంలో మరో బోరు వేశాడు. రెండు బోర్లు, బావి ఉన్నా నీళ్లు అందక ఎకరం పొలం ఎండిపోతున్నది. ఈ నేపథ్యంలో బెజ్జికల్ గ్రామానికి చెందిన రైతు వద్ద ఆదివారం ట్యాంకర్ నీటికి రూ.2 వేలు చెల్లించి పొలానికి పోయించుకున్నాడు. 10 గుంటల మడికి ఐదు ట్యాంకర్ల నీరు పట్టాయని, అందుకు రూ.10 వేలు చెల్లించానని రైతు శ్రీనివాస్ చెప్పాడు. ఎకరం పొలం తడవాలంటే ఇంకా 12–15 ట్యాంకర్ల నీరు అవసరం వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అదికాక ఉదయం నుంచి సాయంత్రం వరకు నడి ఎండలో కాపుకాసుకుంటూ పొలంలో ఉండాల్సి వస్తుందని, గ్రామంలో మొదటి సారిగా ట్యాంకర్ ద్వారా తానే నీటిని పోయించానని తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి సాగర్ ఎడమకాల్వకు నీళ్లందించాలని కోరుతున్నాడు.

250 ఫీట్లు వేసినా నీళ్లు లేవు..

చిట్యాల : మండలంలోనూ భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. మండలానికి సాగు నీరందించాల్సిన పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలు పూర్తి కాకపోవడంతో నీటి కష్టాలు అలాగే ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల్లో ప్రస్తుతం నీళ్లు లేక పంటలు ఎండిపోయే దుస్థితి ఏర్పడింది. మండలంలో 1,350 ఎకరాల్లో వరి వేయగా అందులో 50 శాతం వరకు ఎండిపోయే దశలో ఉన్నది. పరిస్థితులను చూసి రైతులు యాసంగిలో సగం భూములనే సాగు చేసినప్పటికీ అవి కూడా చేతికందే పరిస్థితి కనిపించడం లేదు. గతంలో 150 నుంచి 200 ఫీట్ల లోపు బోరు వేస్తే నీళ్లు పడేవని, కానీ ప్రస్తుతం 200 నుంచి 250 ఫీట్ల వరకు వేసినా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎండుతున్న పొలాలను కాపాడుకునేందుకు కొందరు రైతులు బోర్లు వేసి నీరిందించే ప్రయత్నం చేస్తుండగా మరి కొందరు ట్యాంకర్ల ద్వారా నీరు పోస్తున్నారు. శివనేనిగూడెం, పెద్దకాపర్తి, పిట్టంపల్లి, చిన్న కాపర్తి, ఆరెగూడెంతో పాటు దాదాపు అన్ని గ్రామాలలో పరిస్థితి ఇలాగే ఉన్నది.

రామన్నపేట మండలంలోనూ ఇదే పరిస్థితి

రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోనూ కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఆసిఫ్‌నెహర్ కాల్వ ద్వారా నీళ్లు రాకపోవడం, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు, బావుల్లో నీళ్లు లేకుండా పోయాయి. దాంతో రైతులు పొట్ట దశకు వచ్చిన వరి పొలాలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు రైతులు పొలాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి తడుపుతున్నారు. కొంతమంది రైతులు కొత్తగా బోర్లు వేస్తున్నారు. మండల వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో 13,973మంది రైతులు 28,640 ఎకరాల్లో వరి సాగు చేశారు. గడిచిన ఎనిమిదేండ్లలో ఇలాంటి పరిస్థితి రాలేదని, పంటలు చేతికొచ్చేది కష్టమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రామన్నపేట మండలం బోగారంలో వరి పొలానికి ట్యాంకర్‌తో నీరు పెడుతున్న రైతు ధనుంజయ

నల్లగొండ మాన్యంచెల్కలో గృహజ్యోతి లబ్ధిదారుకు జీరో కరెంట్ బిల్లు అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన కలెక్టర్ హరిచందన

90 రోజుల్లోనే హామీలు అమలు

- మార్చి 11 నుంచి ఇందిరమ్మ ఇండ్లు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్లులు అందజేత

నల్లగొండ రూరల్/నల్లగొండ సిటీ/తిప్పర్తి,మార్చి 3 : తమ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలను 90 రోజుల్లోనే అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం కింద రూ.500 వంటగ్యాస్, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్ అందిస్తున్నామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాన్యం చెల్క, హైదర్‌ఖాన్ గూడ, రహమత్ నగర్ ప్రాంతాల్లో, కనగల్ మండల కేంద్రం, తిప్పర్తి మండలం మర్రిగూడెం గ్రామంలో ఆదివారం గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు కరెంట్ వాడిన వారికి జీరో బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ జ్యోతి కింద జిల్లాలో లక్షా82 వేల మంది లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ నెల 11న ఇండ్లు లేని పేద వారికి ఇందిరమ్మ ఇండ్లు అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. సొంత స్థలం ఉన్న వారికి ఇల్లు నిర్మించేందుకు రూ.5 లక్షలు ఇస్తామని, ఇంటి స్థలం లేని వారికి స్థలాన్ని చూపించి ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. జిల్లా కేంద్రంలోని మామిళ్లగూడెంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో మా న్యంచెల్కలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కొత్తభవనాన్ని నిర్మిస్తామన్నారు. వేసవిలో తాగు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగు నీరు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ దాసరి హరిచందన, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, నల్లగొండ ఆర్డీఓ రవి, జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి, ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, డీఈ వెంకటేశ్వర్లు, ఎస్ఈలు చంద్రమోహన్, తాసీల్దార్లు స్వప్న, పద్మ, ఏడీ సత్యనారాయణ, ఏఈ రమ్య, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్ కాలనీలో ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళలు

కృష్ణమ్మ చెంత తాగునీటికి కటకట

- నందికొండ మున్సిపాలిటీలో మూడు రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- మోటర్లు చెడిపోవడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- అరకొరగా ట్యాంకర్ల ద్వారా అందజేత

నందికొండ, మార్చి 3 : కృష్ణానదిపై నిర్మించిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు చెంతనే ఉన్న నందికొండ మున్సిపాలిటీలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటిని సరఫరా చేసే ఫిల్టర్ హౌస్‌లో మోటర్లు చెడిపోవడంతో కాలనీలకు నీళ్లు రావడం లేదు. పైలాన్ కాలనీలో మూడు రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. దాంతో బిందెలు, డ్రమ్ము ల్లో నీటిని పట్టుకొనే దుస్థితి ఏర్పడింది. దాంతో గత ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులు మళ్లీ కనిపిస్తున్నాయి. నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్‌కాలనీలో ఏర్పాటు చేసిన ఫిల్టర్ హౌస్ ద్వారా హిల్ కాలనీ, పైలాన్ కాలనీలకు నీటి సరఫరా అవుతుంది. తరుచూ ఫిల్టర్ హౌస్‌లో మోటర్లు, పంపులు పాడైపోవడంతో రెండు, మూడు రోజుల కొకసారి నీటి సరఫరా నిలిచిపోతున్నది. తాజాగా పైలాన్‌కాలనీకి నీటిని సరఫరా చేసే పంపు పాడైపోగా దానిని ఎన్నెస్పీ అధికారులు మరమ్మతులు చేయించినా బాగు కాలేదు. దాని స్థానంలో నూతనంగా రూ.1.60 లక్షలతో పంపును ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎన్నెస్పీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. మూడు రోజులుగా నీళ్లు లేక జనం అల్లాడుతున్నారు. మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని కాలనీలకు అందిస్తున్నా అవి సరిపోవడం లేదు. ఇదే అదునుగా మున్సిపల్ ట్యాంకర్ల డ్రైవర్లు రూ.500 ట్యాంకర్ నీటిని అమ్ముకుంటూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దాంతో ప్రజలకు నీళ్లు అందక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనిపై ఫిల్టర్ హౌస్ ఎన్నెస్పీ ఏఈ భిక్షమయ్యను వివరణ కోరగా ఫిల్టర్ హౌస్‌లో పంపు పాడైపోయిందని, దానిని బాగు చేయిండానికి వీలు కాకపోవడంతో ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు. కొత్త పంపు ఏర్పాటుకు ఇంకా మూడు రోజులు పడుతుందని, త్వరగా ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు.